
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జనగామ

ఆదివారం 31 మార్చి 2024

5

శనివారం ఉష్ణోగ్రతలు | గరిష్ఠం: 37.0°C | కనిష్ఠం: 24.0°C




రంజాన్ వేళలు

ఇఫ్తార్ : ఆదివారం సా : 6.34 గం..

సహర్ : సోమవారం ఉ : 4.48 గం..

కాయ్ రాజా కాయ్!

IPL



జిల్లాలో జోరుగా ఐపీఎల్ బెట్టింగ్

- ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా పందాలు
- గ్రామీణ ప్రాంతాలకూ పాకిన జూదం
- రూ.లక్షలు పోగొట్టుకుంటున్న యువత
- అప్పుల పాలై చివరకు ఆత్మహత్యలు

జనగామ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): క్రికెట్.. యువతలో ఈ ఆట అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ ఇదొక క్రేజ్. నిన్నామొన్నటి వరకు కేవలం ఆడుకోవడానికే పరిమితమైన ఈ ఆట ఇప్పుడు బెట్టింగులకు కేంద్రంగా మారింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) పోటీలు ప్రారంభం కావడంతో బెట్టింగులు జోరందుకున్నాయి. యువతతో పాటు నడివయస్సు వారు సైతం బెట్టింగులకు అలవాటు పడుతున్నారు. ఆన్‌లైన్‌తో పాటు నేరుగా రూ. వేలల్లో బెట్టింగులు వేస్తున్నారు. బెట్టింగుల మాయలో పడి యువత వ్యసనపరులుగా మారుతున్నారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే దురాశతో అప్పులు చేసి మరీ రూ.వేలల్లో డబ్బులు పెడుతూ ఆర్థికంగా నష్టపోతున్నారు. బెట్టింగుల మూలంగా వచ్చే దాని కంటే పోయేదే ఎక్కువ ఉండడంతో అప్పుల పాలవుతున్నారు. ఇంట్లో తెలియకుండా తెలిసిన వాళ్ల దగ్గర అప్పులు చేసి చివరకు నష్టం రావడంతో ఆత్మహత్యలకు సైతం పాల్పడ్డ సందర్భాలు గతంలో చాలా ఉన్నాయి.

ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా..

క్రికెట్ బెట్టింగుల కోసం ఆన్‌లైన్‌లో విచ్చలవిడిగా యాప్స్ అందుబాటులో ఉన్నాయి. ఈ యాప్స్‌పై నిఘా ఉండకపోవడంతో బెట్టింగ్‌రాయుళ్లకు అనుకూలంగా మారింది. ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులతో పాటు నిరుద్యోగులు సైతం క్రికెట్ బెట్టింగ్ మాయలో పడిపోతున్నారు. ఇందుకోసం పలు యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకొని ఇంట్లో నుంచి కదలకుండానే దందాలో దిగుతున్నారు. గతంలో ఎక్కడో హైదరాబాద్‌లోనో, మరే నగరంలోనో ఉన్న బుకీల ద్వారా ఫోన్లో బెట్టింగులు జరిగేవి. దీని వల్ల అప్పట్లో నామమాత్రంగానే యువత ఈ వైపు వెళ్లేవారు. కానీ.. ప్రస్తుతం అనేక యాప్స్ రావడంతో ఎక్కువ సంఖ్యలో యువత, నిరుద్యోగులు బానిసలుగా మారుతున్నారు.

ఫేక్ లొకేషన్‌తో..

ఆన్‌లైన్ బెట్టింగులు పెరగడంతో తెలంగాణ ప్రభుత్వం గతంలో పలు యాప్‌లను నిషేధించింది. దేశంలో అనేక రాష్ట్రాల్లో ఈ యాప్‌ల వినియోగం ఉండగా తెలంగాణలో పలు యాప్‌లపై నిషేధం ఉంది. అయినప్పటికీ యువత ఫేక్ లొకేషన్, ఫేక్ పిన్‌కోడ్‌తో నిషేధిత యాప్‌లు తెలంగాణలోనూ పనిచేసేలా చేస్తున్నారు. ఒక ప్రముఖ బెట్టింగ్ యాప్‌పై తెలంగాణలో నిషేధం ఉండగా యాప్‌లో రాష్ట్రాన్ని సూచించే చోట యువత ఇతర రాష్ట్రాల పేరు, ఇతర రాష్ట్రాల పిన్‌కోడ్ ఎంటర్ చేసి బెట్టింగ్ కాస్తున్నారు. బెట్టింగులో గెలిస్తే బ్యాంకు ఖాతాలో డబ్బులు జమవుతాయి. కాగా.. బెట్టింగుల ద్వారా వచ్చిన డబ్బుపై బ్యాంకుల్లోనూ నిఘా లేకపోవడంతో బెట్టింగు రాయుళ్లకు మంచి అవకాశంగా మారింది.

గ్రూపులుగా ఏర్పడి..

జిల్లాలో ఆన్‌లైన్ బెట్టింగులతో పాటు ఆఫ్‌లైన్ బెట్టింగులు కూడా జోరుగా నడుస్తున్నాయి. గతంలో హైదరాబాద్, వరంగల్ వంటి నగరాల్లోనే ఈ తరహా బెట్టింగుల సంస్కృతి ఉండగా ప్రస్తుతం మండల కేంద్రాలు, గ్రామాలకు సైతం పాకింది. యువత, నిరుద్యోగులతా గ్రూపులుగా ఏర్పడి బెట్టింగ్ వేస్తున్నారు. క్రికెట్ మ్యాచ్ ప్రారంభానికి ముందే ఓ చోట సమావేశమై బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. ఒక్కో మ్యాచ్‌పై రూ.1000 నుంచి రూ. 50 వేల వరకు బెట్టింగ్ కాస్తున్నట్లు సమాచారం. మ్యాచ్ టాస్ వేసినప్పటి నుంచి చివరి బాల్ వరకు బెట్టింగ్ తంతు నడుస్తోంది. ఒక్కో బాల్‌పై, ఒక్కో ఓవర్‌పై, ఏ ఆటగాడు ఎన్ని పరుగులు చేస్తాడన్న దానిపై కూడా బెట్టింగులు నడుస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాకేంద్రంతో పాటు ఆయా మండలకేంద్రాల్లో యువత, నిరుద్యోగులు ఒకచోట చేరి ఈ తంతు నడిపిస్తున్నారని సమాచారం.

ఇళ్లలో తెలియకుండా అప్పులు

బెట్టింగులకు బానిసైన యువత ఇంట్లో తెలియకుండానే రూ. లక్షల్లో అప్పులు చేస్తున్నారు. తెలిసిన వారు, తెలియని వారంటూ తేడా లేకుండా అందరి వద్దా అప్పులు చేస్తూ బెట్టింగులకు తగలెడుతున్నారు. చేసిన అప్పులు ఎక్కువై అప్పులు ఇచ్చిన వారు ఇంటి మీదకు రావడంతో బెట్టింగుల బాగోతం బయటపడుతోంది. దీంతో నలుగురికీ తెలిస్తే పరువు పోతుందనే భయంతో తల్లితండ్రులు మూడోకంటికి తెలియకుండా అప్పులు తీర్చేస్తున్నారు. బయట వారి వద్దనే కాకుండా ఆన్‌లైన్ లోన్ యాప్‌లలోనూ విచ్చలవిడిగా అప్పులు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఆన్‌లైన్ లోన్ యాప్స్ పెద్ద సంఖ్యలో అందుబాటులో ఉన్నాయి. ఎలాంటి ష్యూరిటీ లేకుండా యాప్‌లు లోన్స్ ఇస్తుండడంతో యువత పెద్దమొత్తంలో అప్పులు చేస్తూ తీర్చలేక సతమతమవుతున్నారు.

అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు

బెట్టింగుల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక యువత, నిరుద్యోగులతో పాటు బానిసలైన నడివయస్సు వారు ఆత్మహత్యలకు పాల్పడ్డ సందర్భాలూ ఉన్నాయి. బచ్చన్నపేట మండలంలో ఐదేళ్ల క్రితం ఓ యువకుడు క్రికెట్ బెట్టింగ్‌లో రూ.10 లక్షల వరకు పెట్టి నష్టపోవడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. గతేడాది బచ్చన్నపేట మండలంలోని ఓ గ్రామంలో ఓ యువకుడు బెట్టింగ్‌లో నష్టాలు రావడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో అతడి భార్యాపిల్లలు దిక్కులేనివారయ్యారు. రఘునాథపల్లి మండలంలోని ఓ గ్రామంలో గత ఏడాది ఓ యువకుడు సైతం బెట్టింగ్ కాటుకు బలయ్యాడు. బెట్టింగుల వల్ల నష్టపోయి ఆత్మహత్య చేసుకున్నప్పటికీ పరువు పోతుందనే ఆవేదనతో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు చెప్పుకోవాల్సి వస్తోంది.



పట్టుబడితే జైలుకే..

- పి. సీతారామ్, వెస్ట్‌జోన్ డీసీపీ, జనగామ

బెట్టింగుల కు బానిసలు అవడం మూలంగా యువత పెద్ద మొత్తంలో డబ్బులు పోగొట్టుకుంటున్నారు. తల్లితండ్రులను వేధించి మరీ డబ్బులు తెచ్చి బెట్టింగులు పెడుతున్నారు. చట్టరీత్యా ఇది నేరం. క్రికెట్ బెట్టింగులపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ నుంచే కాకుండా జిల్లాలోనూ నిఘా పెట్టాం. వెస్ట్‌జోన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులను అప్రమత్తం చేశాం. యువత బెట్టింగ్ పెడుతూ పట్టుబడినా, బెట్టింగ్ పెట్టినట్లు నిరూపణ అయినా జైలుకు వెళ్లాల్సి వస్తుంది.

భారతరత్న పీవీ..

- పురస్కారాన్ని బహూకరించిన కేంద్రం
- రాష్ట్రపతి ముర్ము నుంచి అందుకున్న కుమారుడు ప్రభాకర్‌రావు



రాష్ట్రపతి చేతుల మీదుగా భారతరత్న అవార్డు అందుకుంటున్న పీవీ ప్రభాకర్‌రావు, వంగరలో పీవీ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

భీమదేవరపల్లి, మార్చి 30 : మాజీ ప్రధాని, స్వర్గీయ పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని బహూకరించింది. శనివారం ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మొత్తం నలుగురికి భారతరత్న పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము అందజేయగా.. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు గాను ఆయన కుమారుడు ప్రభాకర్‌రావుకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రభాకర్‌రావుతో పాటు ఆయన సోదరి సురభి వాణిదేవి, మనుమడు కష్యప్ కూడా వెళ్లారు. ఇక పీవీ నర్సింహారావుకు భారతరత్న పురస్కారాన్ని బహూకరించిన నేపథ్యంలో వంగరలోని పీవీ నివాసంలోని పీవీ విగ్రహానికి స్వామి రామానందతీర్థ సహకార జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎదులాపురం మొగిలి, కాంగ్రెస్ నాయకులు చిదురాల స్వరూప, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒల్లాల రమేష్, చెప్యాల చందారెడ్డి, శ్రీరామోజు మొండయ్య, రాంబాబు, సమ్మయ్య, రామకృష్ణ, లావణ్య తదితరులు క్షీరాభిషేకం చేశారు. టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. తెలుగుతేజం పీవీ విలువలతో కూడిన రాజకీయాలు చేశారని, మచ్చ లేని వ్యక్తిత్వం ఆయన సొంతమని కొనియాడారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఆయన తీసుకున్న నిర్ణయాలే నేడు దేశాన్ని పటిష్ఠంగా నిలిపాయని గుర్తుచేశారు.

మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- జిల్లా అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సందీప



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జడ్జి కె.సందీప

జనగామ కల్చరల్, మార్చి 30: యువతులు మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా కోర్టు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సందీప సూచించారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రథమంగా విద్యపైనే దృష్టి సారించాలని, తదుపరి ఉద్యోగం సాధించి తమ కాళ్లపై తాము నిలబడిన తర్వాతే పెళ్లి చేసుకోవాలని కోరారు. పనిచేస్తున్న ప్రాంతంలో మగవారి నుంచి ఏవైనా సమస్యలు వస్తే ఎలా ఎదుర్కోవాలో వివరించారు. నిర్భయ చట్టం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.బిందు మాధురి, లీగలైడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ ఎం.రవీంద్ర, అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ ఆర్.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

నేడు దేవరుప్పులలో కేసీఆర్ పర్యటన

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



కామారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల, మార్చి 30: బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదివారం దేవరుప్పుల మండలంలో పర్యటిస్తారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం ఆయన కామారెడ్డిగూడెంలోని బిల్లా యాదవరెడ్డి స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ యాసంగి పంటలు ఎండిపోతున్నాయని, చెక్‌డ్యాంలు, చెరువులు, కుంటలను కాంగ్రెస్ ప్రభుత్వం నింపకపోవటంతో భూగర్భ జలాలు అడుగంటి బోరు బావులు వట్టిపోయాయని అన్నారు. ఎండిపోయిన పొలాలను సందర్శించడంతో పాటు బాధిత రైతులను ఓదార్చేందుకు కేసీఆర్ ధరావత్‌తండాకు వస్తున్నారని తెలిపారు. తండాకు చెందిన ఆంగోతు అమీనా, సత్తెమ్మకు చెందిన నాలుగెకరాల వరిపంట పూర్తిగా ఎండిపోయిందని రూ. 2లక్షలు ఖర్చుచేసి బోర్లు వేసినప్పటికీ పడలేదని, రైతు అప్పుల పాలై తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ సీఎం కేసీఆర్ ఆదివారం ఉదయం 10.30 గంటలకు ఆ పంటలను పరిశీలిస్తారని అన్నారు. అనంతరం ఇక్కడి నుంచి సూర్యాపేట జిల్లా తుంగతుర్తికి వెళ్తారని వివరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు పల్లా సుందర్ రామ్‌రెడ్డి, బస్వ మల్లేశం, కొల్లూరు సోమయ్య చింత రవి, జోగు సోమనర్సయ్య, మలిపెద్ది శ్రీనివాస్‌రెడ్డి, అనంతోజు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంతమంది నా వెంట ఉండడం గర్వంగా ఉంది

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



హైదరాబాద్‌లో కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న కడియం

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 30: ఇంతమంది కార్యకర్తలు, నాయకులు తన వెంట ఉండడం గర్వంగా ఉందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తున్నారనే సమాచారంతో నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు శనివారం హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్‌కు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నుంచి ఏలాగైనా కావ్యను ఎంపీ అభ్యర్థిగా నిలపాలని పెద్దలు చెప్పడంతో ఒప్పుకోవలసి వచ్చిందన్నారు. అయితే వరంగల్ పార్లమెంట్ పరిధిలోని నాయకుల నుంచి ఎలాంటి సహకారం లభించకపోవడంతో మొదటిసారి పోటీ చేస్తున్న కావ్య ఓడిపోయే పరిస్థితి రావొద్దని అనుకున్నామని, ఈ తరుణంలో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేయాలని పిలుపు రావడంతో ఆలోచనలో పడ్డామని, నియోజకవర్గ నాయకులను అడిగిన తరువాతనే నిర్ణయం చెబుతానని వారికి చెప్పానని అన్నారు. తాను పార్టీ మారకముందే బీఆర్‌ఎస్ నాయకులు తనపై విమర్శలు చేస్తున్నారని, తాటికొండ రాజయ్య, పసునూరి దయాకర్, అరూరి రమేష్ పార్టీ మారినప్పుడు ఎవరూ మాట్లాడలేదని, తాను మారుతున్నానని తెలువగానే విమర్శలు చేయడం సరికాదని అన్నారు. తనను విమర్శించే నైతికత ఎవరికీ లేదని, ఆ హక్కు కేవలం స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజలకు మాత్రమే ఉందని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని, తనను దీవించినట్టే తన కూతురును ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు గుడి వంశీధర్‌రెడ్డి, ఇల్లెందుల బేబి-శ్రీనివాస్, ఎంపీపీ రడపాక సుదర్శన్, నాయకులు బెలిదె వెంకన్న, మారుజోడు రాంబాబు, రాపోలు మధుసూదన్ రెడ్డి, అన్నం బ్రహ్మారెడ్డి, కనకం రమేష్, భూర్ల శంకర్, గన్ను నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

కడియంను కాంగ్రెస్‌లోకి తీసుకుంటే అరాచకమే

జడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ రవి

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 30: పచ్చగా ఉన్న కాంగ్రెస్‌లోకి కడియం వస్తే అరాచకం మొదలవుతుందని జడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి ఆరోపించారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. టీడీపీలో మంత్రిగా ఉన్న సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలపై కేసులు మోపిన వ్యక్తి కడియం అని విమర్శించారు. ఇందిర నాయకత్వంలో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందన్నారు. కడియంను కాంగ్రెస్‌లోకి తీసుకుంటే పదేళ్లుగా పార్టీ కోసం పని చేస్తున్న కార్యకర్తలకు నష్టం జరుగుతుందన్నారు. కడియం అంటేనే వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ అని, టీడీపీలో ఎన్టీఆర్‌కు, బీఆర్‌ఎస్‌లో కేసీఆర్‌కు కాంగ్రెస్‌లోకి వస్తే సీఎం రేవంత్ రెడ్డికి వెన్నుపోటు పొడుస్తాడని అన్నారు. వరంగల్ పార్లమెంట్ టికెట్ కడియం కుమార్తె కావ్యకు ఇస్తే ఓడిస్తామని, సింగపురం ఇందిరకు ఇస్తే భారీ మెజార్టీతో గెలపిస్తామని అన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు జూలకుంట్ల శిరీష్ రెడ్డి, గుర్రం యాదగిరి, కుందూరు శ్రీనివాస్ రెడ్డి, సింగపురం దయాకర్, ఐలపాక భూషణం, సింగపురం నాగయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎంపికలో ఉత్కంఠ

- రాజయ్యను పార్టీలోకి తీసుకువచ్చే ప్రయత్నాలు
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాయబారం

రాంనగర్, మార్చి 30: వరంగల్ బీఆర్‌ఎస్ లోక్‌సభ అభ్యర్థి ఎంపికలో ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే అరూరి రమేశ్ బీజేపీలో చేరడం, ఆ తర్వాత బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన కడియం కావ్య తాను పోటీచేయలేనంటూ తప్పుకోవడం, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, తన కూతురు కావ్యతో కలిసి కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు సిద్ధమవడం బీఆర్‌ఎస్ శ్రేణులను గందరగోళంలో పడేశాయి. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎంపిక కోసం అధినాయకత్వం కసరత్తు చేస్తోంది. బీఆర్‌ఎస్‌ను వీడిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్యను తిరిగి పార్టీలోకి తీసుకువచ్చే ప్రయత్నాలు ప్రారంభించగా.. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాయబారం నడుపుతున్నట్టు తెలిసింది. రాజయ్యను ఒప్పించిన పల్లా.. మాజీ సీఎం కేసీఆర్ వద్దకు ఒకటిరెండు రోజుల్లో రాజయ్యను తీసుకెళ్లే అవకాశాలున్నట్టు తెలిసింది. అయితే కాంగ్రెస్‌లో చేరాలనుకున్న రాజయ్యకు ఆ పార్టీ నుంచి ప్రతికూల పరిస్థితులు రావడంతో తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలుస్తోంది. ఇక నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణి పెద్ది స్వప్న కూడా వరంగల్ ఎంపీ టికెట్ ఆశిస్తుండగా.. ప్రస్తుతం ఆమె వరంగల్ జడ్పీ బీఆర్‌ఎస్ ఫ్లోర్‌లీడర్‌గా ఉన్నారు. డాక్టర్ రాజయ్య, పెద్ది స్వప్న ఇద్దరిలో ఒకరికి బీఆర్‌ఎస్ టికెట్ వచ్చే అవకాశాలున్నాయనే వార్తలు వినిపిస్తున్నాయి. అలాగే ఉద్యమకారుల్లో మాజీ కార్పొరేటర్లు బోడ డిన్నా, జోరిక రమేశ్, చింతల యాదగిరితోపాటు వీరేందర్, బైరి నిరంజన్ పోటీ పడుతున్నారు. వీరిలో బోడ డిన్నా శనివారం ఎర్రవెల్లికి వెళ్లి కేసీఆర్‌ను, మాజీ మంత్రి హరీష్‌రావును కలిశారు. జోరిక రమేశ్‌తో పాటు మిగతా వారు తమ స్థాయిలో టికెట్ కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. కాగా ఆదివారం కేసీఆర్ జనగామ పర్యటన నేపథ్యంలో ఆదివారం జరగాల్సిన బీఆర్‌ఎస్ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని సోమవారానికి వాయిదా వేశారు.

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు

- మిల్లర్లకు కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశాలు
- తమ్మడపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



తమ్మడపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పారంభిస్తున్న కలెక్టర్

బచ్చన్నపేట, మార్చి 30: కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించిన తరువాత మిల్లర్లు కొర్రీలు పెట్టి రైతులను ఇబ్బంది పెట్టొద్దని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. శనివారం తమ్మడపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. ధాన్యంలో తేమశాతం సరిగా ఉన్నప్పటికీ, తాలు లేకుండా మిషన్ ద్వారా జల్లి ఆడిస్తున్నప్పటికీ, కాంటా పూర్తయి ధాన్యం మిల్లులకు చేరుకున్న తరువాత కూడా ఇష్టారాజ్యంగా కొర్రీలు పెడుతూ బస్తాకు రెండు నుంచి మూడు కిలోల వరకు తరుగు తీస్తున్నారని, దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని తెలిపారు. దీంతో కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ తీవ్రంగా స్పందించారు. అలాంటి సమస్యలు ఎదురైతే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిరంతరం తాము పర్యవేక్షిస్తామని భరోసా ఇచ్చారు. రైతులు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం అమ్మి నష్టపోరాదన్నారు. అనంతరం ధాన్యం కుప్పలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద వసతులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్, డీసీవో రాజేందర్‌రెడ్డి, డీఎస్‌వో రోజారాణి, డీటీలు శ్రీనివాస్, దేవానాయక్, తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీవో రఘురామకృష్ణ, మేకల రాజు, సంతోష్, పీఏసీఎస్ సీఈవో బాలస్వామి, పీఏసీఎస్ డైరెక్టర్ బేజాడీ సిద్దులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కార్యాలయానికి ఏం పనిమీద వచ్చారు..

తమ్మడపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన అనంతరం కలెక్టర్ నేరుగా బచ్చన్నపేట తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అరగంట పాటు అధికారులతో సమావేశమయ్యారు. పెండింగ్ ఫైళ్లకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయం ఎదుట వేచిచూస్తున్న రైతులను పలకరించారు. వారికి పలు సూచనలు చేశారు. ధరణి లాగిన్‌లో మరి కొన్ని ఆప్షన్‌లు వచ్చిన తరువాత సమస్యలు పరిష్కారమవుతాయని, అప్పటి వరకు వేచి ఉండక తప్పదని అన్నారు. ఇటీవల పడమటికేశ్వాపూర్ రైతు రఘుపతి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై విచారణ జరుగుతోందని, నివేదిక వచ్చిన తరువాత చర్యలుంటాయని అన్నారు.

నేడు ఉమ్మడి జిల్లా లయన్స్ సమ్మేళనం

హనుమకొండ కల్చరల్, మార్చి 30: వరంగల్ ఉమ్మడి జిల్లాలోని 80 లయన్స్ క్లబ్‌లకు చెందిన వేడుక లయన్స్ సమ్మేళనం ప్రస్తుత 320 - ఎఫ్ గవర్నర్ ఎస్.వెంకటేశ్వర్‌రావు నేతృత్వంలో ఆదివారం వైభవంగా జరుగనుంది. హనుమకొండ ములుగురోడ్‌లోని బీఆర్‌ఆర్ గార్డెన్స్ వేదికగా జరిగే వేడుకల్లో లయన్స్ అంతర్జాతీయ డైరెక్టర్ జి.బాబురావు, మల్టిపుల్ నాయకులు పూర్వ గవర్నర్లతో సహా సుమారు 2వేల మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే వేడుకల్లో భాగంగా సాయంత్రం ఎస్‌వీడీజీ ఎన్నిక జరుగనుంది. లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ కాకతీయ ఆధ్వర్యంలో జరుగనున్న ఈ వేడుకల విజయవంతానికి ప్రత్యేకంగా వివిధ కమిటీలు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున లయన్స్ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈసారి ప్రత్యేకంగా పలుస్పెషాలిటీక్లబ్‌లను ఏర్పాటు చేశామన్నారు. హంగర్ రిలీఫ్ పేరిట తాను ఎన్నికైనప్పటి నుంచి ఈ రోజు వరకు నిరంతరం అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ముఖ్యంగా హనుమకొండ పట్టణ ప్రాంతంలోని నాలుగు క్లబ్‌లతో పాటు జనగామ, తొర్రూరు, స్టేషన్ ఘన్‌పూర్, చేర్యాల, మహబూబాబాద్ పట్టణాలలో లయన్స్ క్లబ్‌లు, గ్రామీణ ప్రాంతాల్లో పాలకుర్తి, మొండ్రాయి, ములుగులాంటి పలు క్లబ్‌లు మంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఆదివారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

నేడు బ్యాంకు సేవలు యథాతథం

వరంగల్ చౌరస్తా, మార్చి 31: ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం మార్చి 31 ఆదివారంతో ముగియనున్న వేళ దేశ వ్యాప్తంగా ఆదివారం అన్ని బ్యాంకులు లావాదేవీలు నిర్వహించాలని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆదేశాలు జారీ చేసింది. ఈనేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు ఆదివారం కూడా సేవలను అందించనున్నాయి. ప్రభుత్వానికి చెల్లించే లావాదేవీలు, నగదు, చెల్లింపు ఆర్టీజీఎస్ నెఫ్ట్, చెక్కుల చెల్లింపు, క్లియరెన్స్ లాంటి సేవలు పనిచేస్తాయని అధికారులు పేర్కొంటున్నారు.

టీవీ, సోషల్ మీడియా చానళ్లలో తప్పుడు ప్రచారం

» 10 సంస్థలకు నోటీసులు పంపా: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కొన్ని టీవీ చానళ్లతోపాటు, యూట్యూబ్, సోషల్ మీడియా సంస్థలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ లీగల్ నోటీస్‌లు పంపించారు. ఇప్పటికే పలు చానళ్లకు లీగల్ నోటీస్‌లు పంపిన కేటీఆర్.. శనివారం మరో 10 సంస్థలకు లీగల్ నోటీస్‌లు పంపించారు. తనను, తన కుటుంబాన్ని బద్నాం చేయాలనే కుట్రలో భాగంగా అసత్య ప్రచారాలు, కట్టు కథలు అల్లుతున్నాయని, అందుకే ఆయా మీడియా సంస్థలకు నోటీసులు పంపినట్లు కేటీఆర్ వెల్లడించారు. మీడియా ముసుగులో అవన్నీ కుట్ర చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అయితే ఇప్పటికే కొన్ని మీడియా సంస్థలు తప్పు తెలుసుకుని వీడియోలు తీసివేసినట్లు తనకు సమాచారం అందించాయన్నారు. వారంలోగా మిగతా చానళ్లు కూడా తీసివేయాలని, లేదంటే వాటిపై చట్టప్రకారం ముందుకెళ్తామని శనివారం కేటీఆర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కేసీఆర్ అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి

» విదేశాలకు పారిపోకుండా పాస్‌పోర్టును సీజ్ చేయాలి

» హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో జేఏసీ ఫిర్యాదు

హుస్నాబాద్, మార్చి 30: బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో నియోజకవర్గ జేఏసీ నాయకులు ఫిర్యాదు చేశారు. అవినీతికి పాల్పడిన కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, సంతోష్‌రావు విదేశాలకు పారిపోకుండా వారి పాస్‌పోర్టులు సీజ్ చేయాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, సచివాలయనిర్మాణం, వరంగల్ జైలు కూల్చివేత, గొర్ల పంపిణీ, దళిత బంధు, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు అనుమతులు, ధరణి పేరిట భూ కబ్జాలు తదితర అంశాలపై రూ.లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు.

ఏళ్లు గడిచినా గుర్తింపు లేదని..

» సీఎం నివాసం వద్ద కాంగ్రెస్ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

బంజారాహిల్స్, మార్చి 30, (ఆంధ్రజ్యోతి): పార్టీలో చేరి సంవత్సరాలు గడుస్తున్నా తనకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఓ కాంగ్రెస్ కార్యకర్త సీఎం నివాసం వద్ద ఆత్మహత్యాయత్నం చేశాడు. వరంగల్ జిల్లా భూపాలపల్లికి చెందిన కృష్ణ సాగర్ నగరంలోని రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటూ వ్యాపారం చేస్తున్నాడు. కాంగ్రెస్ కార్యకర్తగానూ వ్యవహరిస్తున్నాడు. జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసం వద్దకు శనివారం కారులో వచ్చాడు. సీఎంను కలిసేందుకు ప్రయత్నించగా భద్రతా సిబ్బంది వారించారు. దీంతో కృష్ణ సాగర్ తనతో తెచ్చుకున్న డీజిల్ పోసుకొని నిప్పు అంటించుకుంటానంటూ బెదిరించాడు. అక్కడే ఉన్న పోలీసులు స్పందించి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కృష్ణసాగర్ మాట్లాడుతూ తాను సీఎం రేవంత్‌తోపాటు టీడీపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చినట్టు చెప్పాడు. పార్టీలో ఏళ్లుగా పనిచేస్తున్నా గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

జూన్ 1 నుంచి ఇంటర్ కాలేజీల ప్రారంభం

హైదరాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరానికి (2024-25) సంబంధించిన అకడెమిక్ క్యాలెండర్‌ను ఇంటర్ బోర్డు శనివారం ప్రకటించింది. దీనిప్రకారం జూన్ 1 నుంచి కొత్త విద్యాసంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయి. నవంబరు 18 నుంచి అర్ధ సంవత్సర పరీక్షలు, 2025 జనవరి 20 నుంచి ప్రీఫైనల్, ఫిబ్రవరి మొదటివారంలో ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి మొదటివారంలో వార్షిక పరీక్షలు ఉంటాయని బోర్డు తెలిపింది.

పోలీస్ టు పొలిటికల్

(మొదటి పేజీ తరువాయి)

మలుపు తిరిగింది. "సాధారణంగా టాస్క్‌ఫోర్స్ బృందాలు, స్పెషల్ ఆపరేషన్ బృందాలు ఎన్నికల సమయంలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ బూత్‌లపై దృష్టిపెడతాయి. స్ట్రైకింగ్ ఫోర్స్ స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ పేరుతో ఈ బృందాలు తమకు వచ్చిన సమాచారం మేరకు ఏ నియోజకవర్గంలోనైనా పర్యటిస్తాయి. అనుమానితులను సోదా చేస్తాయి. వీరి వాహనాలను ఇతర తనిఖీ బృందాలు అడ్డగించవు" అని ఓ విశ్రాంత పోలీసు అధికారి వివరించారు. దీన్ని బట్టి రాధాకిషన్‌రావు తమకు ఉన్న అధికారాలను, వెసులుబాట్లను దుర్వినియోగం చేసి, డబ్బు తరలించి ఉంటారని దర్యాప్తు అధికారులు అంచనాకు వచ్చారు. ఎవరి కోసం డబ్బు తరలించారు? ఎవరికి అందజేశారు? అనే ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు విప్పితే.. రాజకీయ నాయకుల పాత్ర బయటకు వస్తుందని తెలుస్తోంది. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న రాధాకిషన్‌రావును కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని, విచారించేందుకు పంజాగుట్ట పోలీసులు సిద్ధమవుతున్నారు. ట్యాపింగ్‌తోపాటు.. నగదు తరలింపు వెనక ఉన్న రాజకీయ శక్తులెవరనేది రాధాకిషన్ విచారణలో తేలుతుందని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. రాధాకిషన్‌ను ఏయే అంశాలపై ప్రశ్నించాలి? అనే దానిపై ఉన్నతాధికారుల బృందం ఇప్పటికే ఓ ప్రశ్నావళిని సిద్ధం చేసినట్లు సమాచారం. "పోలీసు వాహనాల్లో డబ్బులు తరలించాలని ఆదేశించిన నాయ



కులెవరు? ఎన్నిసార్లు నగదును తరలించారు? ఎక్కడి నుంచి ఎక్కడికి చేరవేశారు? ఎవరికి అందజేశారు? ఆ నగదును ఎక్కడి నుంచి సర్దుబాటు చేశారు? ఈ కుట్రలో ఇంకా ఎవరెవరికి భాగస్వామ్యం ఉంది?" అనే ప్రశ్నలకు రాధాకిషన్ నుంచి సమాధానాలు రాబట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు తెరిస్తే.. గత ప్రభుత్వ పెద్దలు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు అరెస్టయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. మనీలాండరింగ్ కోణం ఉండడంతో.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కూడా రంగంలోకి దిగే సూచనలున్నాయి. కాగా, ఈ కేసులో మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుది తొలి అరెస్టు కాగా.. ఆయనను అదే రోజు సస్పెండ్ చేశారు. అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న కూడా 48 గంటలకు మించి జైలులో ఉన్న నేపథ్యంలో నిబంధనల ప్రకారం వారిని సస్పెండ్ అయినట్లే..! అయితే.. సోమవారం అధికారికంగా సస్పెన్షన్ ఉత్తర్వులు వెలువడతాయని డీజీపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

చంచల్‌గూడ జైలుపై నిరంతర నిఘా..!

ఫోన్ ట్యాపింగ్ సంచలన కేసు కావడంతో.. నిందితులు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న చంచల్‌గూడ జైలుపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ప్రస్తుతం భుజంగరావు, తిరుపతన్న పోలీసు కస్టడీలో ఉండగా.. ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావు జైలులో ఉన్న విషయం తెలిసిందే.! దీంతో వారి బ్యారెక్‌లు, కదలికలు, ములాఖత్‌కు వస్తున్నవారిపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ఎస్ఐబీ నుంచి డీఎస్పీ స్థాయి నేతృత్వంలోని ఓ బృందం ఈ నిఘాను పర్యవేక్షిస్తోంది.

అదుపులో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు..?

ఈ కేసులో ఇప్పటి వరకు ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్‌రావు, మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, ఐ న్యూస్ ఎండీ శ్రవణ్‌రావు నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే! వీరితోపాటు.. ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు కూడా పాత్రధారులేనని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఈ ఐదుగురిలో ఇద్దరు ఇప్పటికే విచారణకు హాజరయ్యారు. తాజాగా.. మరో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లను అదుపులోకి తీసుకుని, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో విచారిస్తున్నట్లు తెలిసింది. వీరు గతంలో ఎస్ఐబీలో పనిచేశారా..? లేక టాస్క్‌ఫోర్స్‌లో రాధాకిషన్ టీమ్‌లో పనిచేశారా..? ఫోన్‌ట్యాపింగ్‌తో నేరుగా సంబంధం ఉందా? లేక రాధాకిషన్‌రావు ఆదేశాలతో వ్యాపారుల ప్రొఫైల్స్ తయారు చేసి, అక్రమ వసూళ్ల దందాకు పాల్పడ్డారా? అనే వివరాలు తెలియాల్సి ఉంది. మరోవైపు.. భుజంగరావు, తిరుపతన్న కింద పనిచేసిన సిబ్బందిపైనా అధికారులు ఆరా తీస్తున్నారు.

కామారెడ్డి మునిసిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం

» చైర్‌పర్సన్ పదవిని కోల్పోయిన జాహ్నవి

» వనపర్తిలో హైడ్రామా..

బీఆర్ఎస్‌కు 8 మంది రాజీనామా

కామారెడ్డి/మహబూబ్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కామారెడ్డి మునిసిపల్ కౌన్సిల్ పీఠాన్ని బీఆర్ఎస్ కోల్పోయింది. మునిసిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి 10 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కూడా మద్దతు తెలిపారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ.. కామారెడ్డి మున్సిపాలిటీని కోల్పోవాల్సి వచ్చింది. కామారెడ్డి మునిసిపల్ చైర్‌పర్సన్‌పై ఈనెల 11 న కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో అధికారులు శనివారం బలపరీక్ష సమావేశం నిర్వహించారు. కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్‌లో మొత్తం 49 మంది సభ్యులు ఉండగా.. అవిశ్వాసం నెగ్గడానికి 34 మంది సభ్యుల అవసరం ఉంది. అయితే, శనివారం జరిగిన బలపరీక్షకు కాంగ్రెస్ పార్టీకి చెందిన 27 మంది కౌన్సిలర్లు, బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది కౌన్సిలర్లు హాజరై అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దీంతో కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం నెగ్గిందని అధికారులు ప్రకటించారు. కాగా, కాంగ్రెస్ కౌన్సిలర్లు తనపై అవిశ్వాస తీర్మానం చెల్లుబాటు కాదని పేర్కొంటూ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఈనెల 12న తీర్పు వెలువడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోవైపు వనపర్తి మునిసిపాలిటీలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి షాక్ తగిలింది. కౌన్సిలర్లు ఎవరూ పార్టీని వీడొద్దన్న ఉద్దేశంతో చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌తో ఆయన రాజీనామా చేయించిన విషయం తెలిసిందే. అయితే, శనివారం 8 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. గత మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఐదుగురు సభ్యులు గెలువగా, ఆ తర్వాత బీజేపీ నుంచి ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి ఇద్దరు ఆ పార్టీలో చేరారు. టీడీపీకి ఒక కౌన్సిలర్ ఉండగా ఆమె కూడా కాంగ్రెస్‌కే మద్దతు తెలుపుతున్నారు. తాజాగా 8 మంది కౌన్సిలర్ల రాజీనామాతో కాంగ్రెస్ బలం 18కి చేరనుంది. దీంతో మొత్తం 33మంది కౌన్సిలర్లున్న వనపర్తి మునిసిపల్ పీఠాన్ని కాంగ్రెస్ చేజిక్కించుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

కేకేకు బీఆర్ఎస్ ఏం అన్యాయం చేసింది?

» ఆయనకు రెండుసార్లు రాజ్యసభ.. కూతురికి మేయర్ పదవి ఇచ్చాం

» కష్టకాలంలో పార్టీని వీడడం దురదృష్టకరం

» కాంగ్రెస్ పాలనలో అందరికీ అన్యాయం

» ఆరు నెలల్లో అధికారం బీఆర్ఎస్‌దే: హరీశ్



గజ్వేల్, మార్చి 30: "బీఆర్ఎస్ కేశవరావు(కేకే)కు రెండు సార్లు రాజ్యసభ ఎంపీగా అవకాశమిచ్చింది. ఆయన కూతురికి మేయర్ పదవి.. కొడుక్కి కార్పొరేషన్ చైర్మన్ పదవులు కూడా ఇచ్చింది. పార్టీలో పెద్ద మనిషిగా కేకేకు కేసీఆర్ ఎప్పుడూ గౌరవం ఇచ్చే వారు. కేసీఆర్ ఆయనకు ఏం అన్యాయం చేశారు? కష్టకాలంలో పార్టీని వదిలిపోవడం దురదృష్టకరం" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలోని ఓ గెస్ట్‌హౌజ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పార్టీ కష్టకాలంలో ఉండగా విడిచి పెట్టి వెళ్లిన వాళ్లను తర్వాత కాళ్లు మొక్కినా తీసుకోబోమని చెప్పారు. తమకు నష్టం చేసిన వారిని విడిచి పెట్టేది లేదని, లెక్కలు రాస్తున్నామని, తర్వాత వడ్డీతో సహా తీర్చుకుంటామన్నారు. రాష్ట్రంలో వంద రోజుల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆగమయ్యారని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నీటి బుడగలు అని, ఉద్దెర పథకాలు మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. మళ్లా బోర్లు వేసే కాలం వచ్చిందని, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, ఆరు నెలలు ఓపిక పడితే భవిష్యత్తు బీఆర్ఎస్‌దేనని, మళ్లీ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. గజ్వేల్ అభివృద్ధిని ఓర్వలేని బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌కు ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేసిన రఘునందన్ గురుంచి గ్రామాల్లో చర్చ పెట్టాలని హరీశ్‌రావు సూచించారు.

అందరికీ పనులు చేశా

తాను మంత్రిగా ఉన్నప్పుడు అందరికీ అన్ని పనులు చేశానని, సమయాభావం వల్ల కడుపు నిండా మాట్లాడలేకపోయానని, ఇక నుంచి నా ప్రాణం అడ్డం పెట్టి అయినా కార్యకర్తల వెంట ఉంటానని హరీశ్‌రావు అన్నారు. ఏప్రిల్ 2న పూర్తిస్థాయిలో కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడుకుందామని చెప్పారు.

కేయూ బడ్జెట్ రూ.431.20 కోట్లు

● ఆమోదించిన అకడమిక్ సెనెట్ సమావేశం ● విశ్వవిద్యాలయం అభివృద్ధిలో అందరి కృషి: వీసీ



కేయూ అకడమిక్ సెనెట్ సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య తాటికొండ రమేష్

హనుమకొండ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కాకతీయ విశ్వవిద్యాలయం 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.431.20కోట్ల అంచనా బడ్జెట్ ప్రతిపాదించింది. శనివారం వైస్‌చాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్ అధ్యక్షతన విశ్వవిద్యాలయం సెనెట్‌హాల్‌లో జరిగిన 39వ అకడమిక్ సెనెట్ సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్, డీన్ ఆచార్య పి.అమరవేణి బడ్జెట్ ప్రవేశపెట్టారు. యేడాదిపాటు ఉద్యోగుల వేతనాలు, విశ్రాంత ఉద్యోగుల పెన్షన్‌లు, ఉద్యోగ విరమణ భత్యాలు, ఇతర ఖర్చులకు రూ.449.73కోట్లు కేటాయించారు. మొత్తం బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో రూ.134.94కోట్లు, ఇతర వనరుల నుంచి రూ.296.26కోట్లు రాబడి వస్తుందని అంచనా వేశారు. వీటిలో యూజీసీ నుంచి బకాయిల రూపంలో రూ.32.81కోట్లు, అకడమిక్, ట్యూషన్ ఫీజు రూపంలో రూ.8కోట్లు, అంతర్గత వనరుల ద్వారా రూ.24.28కోట్లు, పరీక్షల విభాగం ద్వారా రూ.58.79కోట్లు రాగలవని అంచనా వేశారు. ఖర్చులను, రాబడులను ఆచార్య అమరవేణి ఎనిమిది అంశాల్లో చూపించారు. అదే సమయంలో రూ.8.08కోట్లు లోటు ఉంటుందని వెల్లడించారు. రుసా నిధులు రూ.44కోట్లు వస్తాయని అంచనా వేశారు. ఉద్యోగుల జీతాలకు, పెన్షన్‌లకు రూ.207.44 కోట్లు, పరీక్షలు, అకడమిక్ కార్యక్రమాలకు రూ.63.44కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు.

అందరి కృషి

విశ్వవిద్యాలయం అభివృద్ధిలో అందరి కృషి ఉందని వైస్ చాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్ తన నివేదికలో పేర్కొన్నారు. న్యాక్ ఏప్లస్ గ్రేడింగ్ సాధించడం ఒక గొప్ప అంశమని అన్నారు. అందుబాటులో ఉన్న పరిమిత వనరులు, రాష్ట్ర ప్రభుత్వ, ఇతర సంస్థల సహకారంతో అకడమిక్, పరిపాలన, మౌలిక వసతుల కల్పన, ఉద్యోగుల సంక్షేమం, ఇత ర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. కెహబ్, పీవీ విజ్ఞాన కేంద్రం, పరిపాలన భవన్‌లో రెండోఅంతస్తు, డైనింగ్ హాల్, బాలికల వసతి గృహం విస్తరణ, దూర విద్య కేంద్రంలో మీడియా సెంటర్ పునరుద్ధరణ అభివృద్ధి పనుల్లో ఉన్నాయన్నారు.

ఒప్పందాలు

అకడమిక్‌పరంగా ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాలతో, జాతీయ స్థాయి సంస్థలతో అవగాహన ఒప్పందాలు, జాయింట్ రిసెర్చ్ ప్రోగ్రామ్‌లు, అధ్యాపకులు, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు, విద్యార్థులకు పోటీ పరీక్షకు శిక్షణ చేపట్టి ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు పొందటంలో ప్రోత్సాహం కల్పించినట్టు తెలిపారు. విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై 40 రోజుల శిక్షణా కార్యక్రమంతో పాటు ఐదేళ్ల విరామం తర్వాత పీహెచ్‌డీ ప్రవేశాలు విజయంతంగా నిర్వహించినట్టు వీసీ వివరించారు. రాష్ట్రపతి, గవర్నర్ నుంచి అవార్డులు పొందినట్టు తెలిపారు. మూడు దశాబ్దాల విరామం తర్వాత ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌ను విజయవంతంగా నిర్వహించామని, అలాగే విభాగాలు, కళాశాలల్లో కూడా అంతర్జాతీయ, జాతీయ సదస్సులు నిర్వహించామన్నారు.

ఉద్యోగుల సంక్షేమం

విశ్వవిద్యాలయ ఉద్యోగుల సంక్షేమం కోసం పలు చర్యలు తీసుకున్నట్టు వీసీ ఆచార్య రమేష్ తెలిపారు. దినసరి వేతన ఉద్యోగుల జీతాలు పెంచినట్టు తెలిపారు. క్యాజువల్ ఉద్యోగుల వేతనాలు కూడా త్వరలో పెరుగుతాయన్నారు. విశ్రాంత ఉద్యోగులకు రావలసిన భత్యాలు, రెగ్యులర్ ఉద్యోగుల పీఆర్‌సీ బెనిఫిట్స్ చెల్లించామన్నారు. గవర్నర్ ఆర్డర్ల ప్రకారం పార్ట్‌టైమ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు రెమ్యునరేషన్‌లు పెంచామన్నారు. పరిమిత, నియమిత ఆర్థిక, మానవ వనరులతో సమష్టి కృషితో ముందుకు పోతున్నామన్నారు.

కోర్సులు

పూర్వపు వైస్‌చాన్సలర్ ఆచార్య వి.గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. జాబ్ ఓరియంటెడ్ కోర్సులు ప్రవేశపెట్టాలని, ప్రభుత్వం నిధులు, నియామకాలకు ముందుకు రావాలని, దూర విద్యాకేంద్రంలో నూతన కోర్సులు ప్రవేశపెట్టాలని అన్నారు. పూర్తిస్థాయి అకడమిక్ సెనెట్ ఉండాలన్నారు. మాజీ వైస్‌చాన్సలర్ ఆచార్య విద్యావతి మాట్లాడుతూ.. పలు విభాగాల్లో రెగ్యులర్ అధ్యాపకుల కొరత చాలా ఉందని అన్నారు. పరిశోధనలు నిరంతరం జరగాలని, పేద విద్యార్థులకు ఉన్నత విద్య దూరం కావొద్దని, నిధులను సమీకరించాలని అన్నారు. అకడమిక్ సెనెట్ సభ్యుడు డాక్టర్ అంపశయ్య నవీన్ మాట్లాడుతూ.. ఉన్నత విద్య నిర్లక్ష్యానికి గురైందని విచారం వ్యక్తం చేశారు. గ్రాంట్స్ పెరగడం లేదని అన్నారు. యూనివర్సిటీలు బాగుపడాలంటే నియామకాలు జరగాలని అభిప్రాయపడ్డారు. న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ రావడం అభినందనీయం అన్నారు. మరో అకడమిక్ సెనెట్ సభ్యుడు మాణిక్యం మాట్లాడుతూ.. యూనివర్సిటీ పాలనలో మహిళా నాయకత్వం పెరగడం అభినందనీయం అన్నారు. ప్రత్యేక ఆహ్వానితుడు, విశ్రాంత ఎకానమిక్స్ విభాగ ఆచార్యులు, శాతవాహన యూనివర్సిటీ మాజీ వైస్‌చాన్సలర్ ఆచార్య ఇక్బాల్ అలీ మాట్లాడుతూ.. ఎన్నో అడ్డంకులు ఎదుర్కొని యూనివర్సిటీ ముందుకు దుసుకొనిపోతున్నదన్నారు. పూర్వ విద్యార్థుల నుంచి నిధులు రాబట్టాన్నారు. డీన్‌లు ఆచార్య ఎన్.రామనాథ్ కిషన్ మాట్లాడుతూ.. గెస్ట్ ఫ్యాకల్టీ నియామకంతో విద్యా విభాగం బలోపేతమైందన్నారు. స్నాతకోత్సవం నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ఆచార్య టి.మనోహర్ మాట్లాడుతూ.. సమష్టి కృషితో ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ విజయవంతమైందన్నారు. ఆచార్య సురేష్‌లాల్, ఆచార్య పి.వరలక్ష్మి, ఆచార్య ఎస్.జ్యోతి, ఆచార్య ఎస్.నరసింహాచారి మాట్లాడారు. అనంతరం సమావేశం బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించింది.

వార్షిక నివేదికలకు ఆమోదం

వార్షిక నివేదికలను కూడా సెనెట్ ఏకగ్రీవంగా ఆమోదించింది. రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి తన ప్రారంభోపన్యాసంలో విశ్వవిద్యాలయం తెలంగాణ రాష్ట్రంలోనే ఇతర విశ్వవిద్యాలయాల కంటే మెరుగ్గా ముందుకు పోతోందన్నారు. పరీక్షల విభాగంలో చేపట్టిన సంస్కరణలను వివరించారు. ఇటీవల మృతి చెందిన అకడమిక్ సెనెట్ సభ్యుడు పోకల చందర్ అకాల మరణానికి సమావేశం రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపింది. విశ్వవిద్యాలయం ప్రజాసంబంధాల అధికారి డాక్టర్ పృథ్వీరాజ్ దృశ్య శ్రవణ విధానం ద్వారా మూడేళ్లలో విశ్వవిద్యాలయంలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. పలువురు ప్రిన్సిపాళ్లు, డీన్లు, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు, సభ్యులు పాల్గొన్నారు. కేయూ పొలిటికల్ సైన్స్ విభాగపు బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా డాక్టర్ గడ్డం కృష్ణయ్య నియమితులైనందుకు సమావేశం అభినందనలు తెలిపింది.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



దేవరుప్పులలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్‌డీవో మొగులప్ప

దేవరుప్పుల, మార్చి 30: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతాంగమంతా సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో మొగులప్ప సూచించారు. ఐకేపీ ఆధ్వర్యంలో శనివారం దేవరుప్పులలోని కొత్తవాడ, రంభోజీగూడెం గ్రామాలలో ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని దళారులకు కాకుండా కొనుగోలు కేంద్రాలలో విక్రయించాలన్నారు. తేమ లేకుండా ధాన్యం ఆరబెట్టుకుని మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హుస్సేన్, డీపీఎం రాజేంద్రప్రసాద్, డీటీ నవీన్‌కుమార్, ఏపీఎం వెంకటరెడ్డి, ఆర్‌ఐ రాజు, సీసీలు వసంత, రామచంద్రం, వీఓఏ గంగరాజు, కమిటీ సభ్యులు భద్రమ్మ, అనిత, ఎల్లమ్మ, లక్ష్మీ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

లింగాలఘణపురం: మండలంలోని నాగారంలో ధాన్యం కొనుగోలుకు జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శనివారం డీఎస్‌వో రోజారాణి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు 17 తేమశాతం మించి లేకుండా ధాన్యం తీసుకొస్తే ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2203, కామన్‌గ్రేడ్ ధాన్యానికి రూ. 2183 చెల్లిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం శంకరయ్య, డీటీసీఎస్ శ్రీనివాస్, సీసీలు నర్రా శ్రీకాంత్‌రెడ్డి, వేముల శ్రీమతి పాల్గొన్నారు.

చిలుపూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని తహసీల్దార్ సరస్వతి కోరారు. శనివారం చిలుపూర్‌లో ఐకేపీ మహిళల ఆధ్వర్యంలో నిర్వహించే కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఊరూరా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం ఈద రమేష్‌కుమార్, సీసీ కనకచంద్రం, నిర్వాహకులు శ్రీలత, రజిత, భాగ్య, సునిత, మంజుల, వీవోఏలు సరిత, నీరజ, గాండ్ల రాజు, శ్రీకాంత్, రవి పాల్గొన్నారు.

నర్మెట: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలని ఏపీఎం మాదారపు రవి అన్నారు. శనివారం హన్మంతాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. కార్యక్రమంలో సీసీలు యాదగిరి, కుమార్, మహిళ సంఘాల సభ్యులు, రైతులు కాల్వ అశోక్, ఎదునూరి సత్తయ్య, వల్లాల లక్ష్మయ్య, పండుగ అంజయ్య, పగడాల నర్సయ్య, గుడికందుల నరహరి, హమాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జఫర్‌గడ్: మండలంలోని తిమ్మంపేటలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం తహసిల్దార్ అంబటి ఆంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారుల బెడద లేకుండా తగు మద్దతు ధరతో రైతుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. కాగా, మండలంలోని తిమ్మంపేటతో పాటు తీగారం, హిమ్మత్‌నగర్, తమ్మడపల్లి(జి), రఘునాథ్‌పల్లి, ఉప్పుగల్లు మొత్తం ఆరు చోట్ల ధాన్య కొనుగోలు కేంద్రాలు మంజూరయ్యాయని ఐకేపీ ఏపీఎం సురేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుమన్, ఎంఆర్‌ఐ అనిల్‌కుమార్, సీసీ కుమారస్వామి, వీఓఏలు, రైతులు పాల్గొన్నారు.

ఎర్రబెల్లి వాహనాన్ని తనిఖీ చేసిన అధికారులు

జఫర్‌గడ్, మార్చి 30 : మండల కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వాహనాన్ని శనివారం పోలీసులు తనిఖీ చేశారు. జరగబోయే పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో తనిఖీల కోసం జఫర్‌గడ్ శివారు నల్లబండ క్రాస్ వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. శనివారం ఎర్రబెల్లి దయాకర్‌రావు కారులో వర్ధన్నపేట నుంచి జఫర్‌గడ్ మీదుగా హైద్రాబాద్ వెళ్తుండగా జఫర్‌గడ్ శివారులోని చెక్ పోస్టు వద్ద పోలీసులు ఆయన వాహనాన్ని ఆపి తనిఖీలు చేశారు.

కరెంట్ కష్టాలకు చెక్

- సోలార్ సిస్టంతో తగ్గనున్న విద్యుత్ భారం
- సబ్సిడీ అందిస్తున్న కేంద్ర ప్రభుత్వం
- స్త్రీ నిధి నుంచి రుణ సదుపాయం
- మిగులు విద్యుత్‌తో అదనపు ఆదాయం

కొడకండ్ల మార్చి 30: రాష్ట్రంలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం అమలులో ఉన్నప్పటికీ కొన్ని సాంకేతిక కారణాలవల్ల అది అందరికీ అందడంలేదు. పైగా దీనికి అందరూ అర్హులు కారు. అలాంటివారికి సోలార్ సిస్టం ఒక వరం లాంటిది. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు సామాన్యులు భరించలేని స్థాయిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు సోలార్ విద్యుత్ వైపు మొగ్గు చూపుతున్నారు. సొంత ఇల్లు ఉన్నావారు ఇంటి స్లాబ్‌పై సుమారు 2 వందల అడుగుల ఖాళీ స్థలంలో ప్యానెల్‌లు బిగించుకున్నట్లైతే ఇంటి అవసరాలకు సరిపడా విద్యుత్ తయారవుతుంది. దీనికయ్యే ఖర్చులో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ పోను మిగతా మొత్తానికి శ్రీనిధి నుంచి రుణ సదుపాయం ఉంది. దీంతో సాధారణ విద్యుత్ కన్నా సోలార్ వైపే వినియోగదారులు మొగ్గు చూపుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ..

సోలార్ విద్యుత్‌తో పర్యావరణానికి ఎలాంటి హాని కలగదు. ముఖ్యంగా రాష్ట్రంలో వర్షాకాలంలో కూడా పగటిపూట సగటు 25 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుంది. ఇక వేసవిలో 45 డిగ్రీలు దాటుతుంది. అందువల్ల ఈ ప్రాంతంలో సౌరవిద్యుత్ ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. ఒకసారి ప్యానెల్స్‌ను బిగించుకుంటే కనీసం 25 సంవత్సరాల పాటు పనిచేస్తాయి. పైగా ఎలాంటి నిర్వాహణ ఖర్చులు ఉండవని నిపుణులు చెబుతున్నారు. తెలంగాణాలో సౌరవిద్యుత్ సామాన్యుడికి ఉన్న ప్రత్యామ్నాయాలలో మెరుగైనదని ప్రజలు భావిస్తున్నారు.

సబ్సిడీ పోను స్త్రీనిధి నుంచి రుణ సదుపాయం

రాష్ట్రంలో సోలార్ విద్యుత్ యూనిట్ల ఏర్పాటును ప్రోత్సహించడం కోసం రాష్ట్రప్రభుత్వం స్త్రీనిధి ద్వారా రుణాలిస్తుండగా కేంద్రప్రభుత్వం సబ్సిడీ అందిస్తోంది. స్వయం సహాయక గ్రూపులలోని సభ్యులు ఇందుకు అర్హులు. అయితే ఇతరులకు కూడా కేంద్రం ఇచ్చే సబ్సిడీ అందుతుంది. మిగతా సొమ్మును సొంతంగా చెల్లించాల్సి ఉంటుంది. ఇంటి అవసరాలను బట్టి 1కేవీ, 2 కేవీ, 3 కేవీ, ఇలా ఎంత అవసరమో నిర్ధారించుకుని ఎన్పీడీసీఎల్ అనుమతి తీసుకుని సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలి. 1 కేవీకి ఖర్చు మొత్తం 83,700 అవుతుండగా అందులో రూ.14,558లు సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. దరఖాస్తు, నెట్ మీటర్ జీఎస్టీతో కలుపుకుని నికరంగా 73,242 రూపాయలు చెల్లించాలి. 2 కేవీకి మొత్తం ఖర్చు రూ.1,44,200 అవుతుండగా అందులో 29,176 కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుంది. మిగతా రూ.1,20,134 చెల్లించాలి. 3 కేవీకి రూ.2,06,400 అవుతుండగా అందులో 43,764 రూపాయలు సబ్సిడీ కేంద్రం అందిస్తుంది. సబ్సిడీ పోగా మిగతా మొత్తానికి స్త్రీనిధి నుంచి రుణ సదుపాయం లభిస్తుంది. ఆ రుణ మొత్తాన్ని 60 నెలల్లో నెలవారీ వాయిదాల్లో తీర్చాల్సి ఉంటుంది. వినియోగదారుని ఇంటి అవసరాలు పోగా మిగిలే విద్యుత్‌ను గ్రిడ్ ద్వారా ప్రభుత్వానికి సరఫరా చేసి నెట్ మీటరింగ్ ద్వారా యూనిట్‌కు 4 రూపాయల చొప్పున ప్రభుత్వానికి అమ్ముకోవచ్చు. రుణం తీరిన తర్వాత మన ఇంట్లో తయారైన విద్యుత్ పూర్తిగా ఉచితమే. మిగులు విద్యుత్‌తో ఆదాయం లభిస్తుంది.



కొడకండ్లలో రూఫ్‌పై బిగించిన సోలార్ ప్యానెల్స్

బిల్లుల కంటే వాయిదాలు కట్టడం మేలు..

పేరం శారద, కొడకండ్ల, గృహిణి



విద్యుత్‌చార్జీలను సామాన్యుడు మోయలేకుండా తయారవుతున్న తరుణంలో సోలార్ విద్యుత్తు ఉత్తమమైన ప్రత్యామ్నాయంగా కనబడుతోంది. మధ్యతరగతి కుటుంబానికి 3కేవీ విద్యుత్ ఇంటి అవసరాలకు సరిపోతుంది. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ కూడా ఇస్తుంది. స్త్రీ నిధి నుంచి మిగతా మొత్తానికి నెలవారీ సులభ వాయిదాలపై రుణం అందించడం హర్షణీయం. విద్యుత్ బిల్లులు కట్టేబదులు అవే డబ్బులు నెలవారీ వాయిదాలు కట్టుకుంటే 60 నెలల్లో రుణం తీరిపోతుంది. అందుకే మేము కూడా 3 నెలల క్రితమే మా ఇంటిపై సోలార్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నాం. ఇప్పటివరకైతే చాలా సంతృప్తిగా ఉంది.

స్త్రీ నిధి నుంచి రుణసదుపాయం..

పి.నిర్మల, రీజినల్ మేనేజర్, స్త్రీనిధి, జనగామ



సౌరవిద్యుత్‌ను సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావడం కోసం కేంద్రప్రభుత్వం అందించే సబ్సిడీ పోను మిగతా మొత్తాన్ని స్త్రీనిధి నుంచి రుణ సదుపాయాన్ని స్వయం సహాయక గ్రూపులలోని సభ్యులకు కల్పిస్తున్నాం. 60 నెలల్లో ఆ రుణాన్ని తిరిగి చెల్లించుకోవచ్చు. వినియోగదారుడు వాడుకోగా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేసి తిరిగి అవసరానికి వాడుకోవచ్చు లేదా డబ్బులు పొందవచ్చు. ఇదే విషయమై అన్ని మండలాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కేంద్రప్రభుత్వ ప్రోత్సాహకాలతో ఇప్పుడిప్పుడే జిల్లావ్యాప్తంగా ప్రజలు ముందుకు వస్తున్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడిన

ఫ్లయింగ్‌స్క్వాడ్ బృంద సభ్యులపై కేసు

రిమాండ్‌కు తరలింపు - ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెండ్

మహబూబాబాద్ రూరల్, మార్చి 30: మహబూబాబాద్ జిల్లా రెండ్యాలలో అక్రమ వసూళ్లకు పాల్పడిన ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందం సభ్యులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తిరుపతిరావు శనివారం తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ జిల్లాలో ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. ఈనెల 20, 21 మహబూబాబాద్ మం డలం నడివాడ, గడ్డిగూడెం, సంద్రాలగూడెం గ్రామాల్లోని కిరాణాషాపుల్లో ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేపట్టాయి. కిరాణషాపుల్లో మద్యం అమ్ముతుండగా, ఎన్నికల కోడ్ ఉండగా, ఎందుకు అమ్ముతున్నారని వారిని బెదిరించారు. తర్వాత తమకు డబ్బులు ఇస్తే మీమీద కేసు లేకుండా చూస్తామని చెప్పి, రెడ్యాలలో మంచాల వేణుకు చెందిన షాపు వద్ద ఫోన్‌పే ద్వారా వేణు నుంచి రూ.1500 తీసుకున్నారని, ఈ విషయం తెలుసుకున్న వేణు స్నేహితుడైన నల్లు దేవేందర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దేవేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందంలోని జూనియర్ అసిస్టెంట్ సద్దాం హుస్సేన్ పలు షాపుల నుంచి నగదు తీసుకుంటూ, నగదు లేనిచోట బృందం సభ్యులైన ఫొటోగ్రాఫర్ కండె వేంకటేశ్వర్లు ఫోన్‌పేకు చేయించుకుంటున్నట్లు చెప్పారు. తర్వాత సద్దాం హుస్సేన్ ఫోన్‌పేకు తిరిగి చేయించుకుని వారు వసూలు చేసిన మొత్తం రూ.15,100ను టీమ్ లీడర్ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఏఈ సామ్రాజ్‌కు ఇచ్చినట్లు దర్యాప్తులో తేలిందని చెప్పారు. ఈనెల 29న జూనియర్ అసిస్టెంట్ సద్దాం హుస్సేన్, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఏఈ సామ్రాజ్, వీడియో గ్రాఫర్ కండె వేంకటేశ్వర్లును అరెస్టు చేసి, కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. వీరితోపాటు టీమ్ సభ్యులైన హెడ్‌కానిస్టేబుళ్లు రమేష్, గోపిని విధుల నుంచి తొలగించినట్లు డీఎస్పీ తిరుపతిరావు తెలిపారు.

కుటుంబ కలహాలతో

యువకుడి ఆత్మహత్య



హరీష్ (ఫైల్)

చిలుపూర్, మార్చి 30 : కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రాజవరం గ్రామానికి చెందిన జాతర గొండ ఎల్లయ్య-రాజవ్వ కుమారుడు హరీష్ (23) స్థానికంగా ఆటో నడుపుతున్నాడు. కొద్ది రోజులుగా ఆటోను పక్కనబెట్టి పనీపాట లేకుండా తిరుగుతుండడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన హరీష్ శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. తండ్రి ఎల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రాజేందర్ దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన టెన్త్ పరీక్షలు

జనగామ కల్చరల్, మార్చి 30: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు సాంఘికశాస్త్రం పరీక్ష నిర్వహించారు. 6698 మంది విద్యార్థులకు గాను ఏడుగురు గైర్హాజరు కాగా 6691 మందితో 99.90 శాతం విద్యార్థులు హాజరయ్యారు. డీఈవో కె.రాము దేవరుప్పుల, జనగామ మండలాల్లో పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ 14 పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు అధికారులు తెలిపారు. కాగా పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు సహకరించిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు డీఈవో కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

దేవరుప్పుల, మార్చి 30: మండలంలోని పలు గ్రామాలనుంచి శనివారం పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, దేవునిగుట్టతండా మాజీ సర్పంచ్ బాలు ఆధ్వర్యంలో పాలకుర్తి కాంగ్రెస్ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె కార్యకర్తలందరికీ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ సాధించిన విధంగా ఈ పార్లమెంటు ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధించిపెట్టాలన్నారు. అందుకు కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలన్నారు. తన కోడలు యశస్వినిరెడ్డి గెలుపుకోసం కృషి చేసిన ప్రతీ ఒక్కరికీ తాము అండగా ఉంటామన్నారు. అదే విధంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని, అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాపాక సత్యనారాయణ, కాకిరాల హరిప్రసాద్, నల్ల శ్రీరామ్, సురేష్‌బాబు, రెడ్డిరాజుల రమేష్, ఇన్నుల నాగరాజు, కాడబోయిన గణేష్, తోటకూరి పాండుకృష్ణ, కాసారపు ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న పలు పార్టీల కార్యకర్తలు

ఎన్నికల విధుల్లో ఉన్నవారికి

పోస్టల్ బ్యాలెట్

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

జనగామ కల్చరల్, మార్చి 30: లోకసభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధులు నిర్వహించే వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. శనివారం ఆయన ఉన్నతాధికారులతో కలిసి జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ వద్ద ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ ముగిసిన వెంటనే సదరు ఉద్యోగులందరికీ తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లోకసభ నియోజకవర్గ కేంద్రాల్లో మే 3న, లోకసభ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో మే 4 నుంచి 8 వరకు పోస్టల్ బ్యాలెట్లు స్వీకరించాలన్నారు. 85 సంవత్సరాలపై బడిన సీనియర్ సిటిజన్లకు, నడవ లేని దివ్యాంగులకు, కొవిడ్ పేషెంట్లకు ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. అర్హులను ఏప్రిల్ 25 నాటికి ఎంపిక చేస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రిజ్వాన్ బాషాతో పాటు అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, మార్చి 30: గ్రూప్స్, ఎస్ఎస్, ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, ఎస్ఐ, కానిస్టేబుల్ మొదలగు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి దయానంద రాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి గల ఎస్సీ అభ్యర్థులు ఏప్రిల్ 10 లోగా జిల్లా కేంద్రం లోని ధర్మకంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఎస్సీ స్టడీ సర్కిల్)లో అడ్మిషన్లు పొందాలన్నారు. అభ్యర్థులకు డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రెసిడెన్షియల్‌తో కూడిన ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు తమ కుల, ఆదాయం, ఎస్ఎస్‌సీ, డిగ్రీ, ఆధార్‌కార్డు, పాస్‌ఫోర్టు సైజు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 98485 03644, 70935 97488 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బీఆర్ఎస్ జెండా ఎగరేస్తాం

రఘునాథపల్లి, మార్చి 30: పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తామని పార్టీ మండల అధ్యక్షుడు వారాల రమేష్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేయడానికి నాయకులు, కార్యకర్తలు అంకిత భావంతో కృషి చేయాలని అన్నారు. ఈ నెల 31న దేవరుప్పుల మండలంలో కేసీఆర్ పర్యటనకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నామాల బుచ్చయ్య, ముసిపట్ల విజయ్, పోకల శివకుమార్, గూడ కిరణ్ కుమార్, సత్తయ్య, రాములు, బొంగు అయిలయ్య, శాగ నాగరాజు, అశోక్, సింగపురం రవి, దొనికెల రమాదేవి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

చిలుపూర్, మార్చి 30 : మండలంలోని వెంకటాద్రిపేటలో మెట్టు అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణ పనులకు మాజీ సర్పంచ్ కందుల రఘుపతి శనివారం భూమిపూజ చేశారు. పూజారి చొల్లేటి రాజేశ్వర శర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రఘుపతి మాట్లాడుతూ గ్రామస్థుల సహకారంతో త్వరితగతిన ఆలయ నిర్మాణం పూర్తి చేస్తామని అన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

టీఎస్‌పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి



విజేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న పింగిలి శ్రీపాల్‌రెడ్డి

జఫర్‌గడ్, మార్చి 30: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పీఆర్‌టీయు సంఘం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఉప్పుగల్లు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మిల్కూరి విజేందర్‌రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాలలో శనివారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ సంఘం కృషి వల్లే 2008 డీఎస్సీ ఉపాధ్యాయులకు న్యాయం జరిగిందన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు రెండు నెలల్లోగా మంజూరయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత పీజీహెచ్ఎంతో పాటు అన్ని రకాల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ఉంటుందన్నారు. టెట్ విషయంలో ఉపాధ్యాయుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. అనంతరం పదవీ విరమణ పొందుతున్న హెచ్ఎం విజేందర్‌రెడ్డిని శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో టీఎస్‌పీఆర్‌టీయు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహిపాల్‌రెడ్డి, ఎల్లారెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు కె.సీతారామయ్య, అసోసియేట్ అధ్యక్షుడు డి.సదానందం, తదితరులు పాల్గొన్నారు.

గెలుపు కోసం పాటుపడాలి

వరంగల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ఆరూరి రమేశ్

జఫర్‌గడ్, మార్చి 30 : రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం కలిసికట్టుగా కృషి చేయాలని వరంగల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. ఉప్పుగల్లుకు చెందిన బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి, పీఏసీఎస్ డైరెక్టర్ గడ్డం రాజు, కార్మిక విభాగం మండల అధ్యక్షుడు నాయిని యాదగిరి గౌడ్, పార్టీ నాయకులు పులి రాజు, మూల యాకయ్య తదితరులు శనివారం హన్మకొండలో అరూరి రమేశ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వివరిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ప్రజలు, పార్టీ శ్రేణుల అండతో బీజేపీ విజయఢంకా మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేశ్ గౌడ్, నాయకులు తిరుపతి, నేరెళ్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన ఈరవెన్ను బీఆర్ఎస్ ఎంపీటీసీ

పాలకుర్తి: మండలంలోని ఈరవెన్ను గ్రామానికి చెందిన బీఆర్ఎస్ ఎంపీటీసీ కొడిశాల యాదగిరి, మాజీ ఎంపీటీసీ అనుమల సులోచన, బీఆర్ఎస్ నాయకులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం హన్మకొండలోని ఆ పార్టీ కార్యాలయంలో బీజేపీలో చేరారు. వరంగల్ పార్లమెంటు అభ్యర్థి అరూరి రమేష్ సమక్షంలో బీజేపీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ దేశంలో మరోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బీజేపీలో చేరిన వారిలో తొర్రూరు పీఏసీఎస్ డైరెక్టర్ గాదరి కాంతమ్మ, అనుముల ఎల్లయ్య, ముస్కు ఉప్పలయ్య, సమ్మయయ చారీ, పోశయ్య, జనార్ధన్, అనిల్, అరవింద్, దామెర వెంకన్నఉపేందర్ చేరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు దొంగరి మహేందర్, కమ్మగాని శ్రీకాంత్, మారం రవి ఉన్నారు.



నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న అరూరి రమేశ్

ఉత్సాహంగా 'రన్ ఫర్ జీసస్'



జనగామలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

జనగామ కల్చరల్, మార్చి 30: పరిశుద్ధ శనివారాన్ని పురస్కరించుకొని క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో రన్‌ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలో క్యాథలిక్, ప్రొటెస్టంట్ సంఘాలన్నీ సమైక్యంగా గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ సండేలకు మధ్య పరిశుద్ధ శనివారం సందర్భంగా ఈ ర్యాలీ నిర్వహించారు. జనగామ చౌరస్తా నుంచి రైల్వే స్టేషన్ వరకు తెల్లని దుస్తులు ధరించి, జెండాలు పట్టుకొని పురవీధుల్లో జరిగిన అధిక సంఖ్యలో క్రైస్తవులు ర్యాలీలో పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: పాస్టర్స్ ఫెలోషిప్ మండల అధ్యక్షుడు కందుకూరి దేవవరం ఆధ్వర్యంలో శివునిపల్లి, ఘన్‌పూర్‌లో శనివారం శాంతిర్యాలీని నిర్వహించారు. ప్రతీ ఒక్కరు శాంతియుతంగా, సోదరభావంతో కలిసి మెలిసి జీవించాలని ప్రజలకు వివరిస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, ఫిలిప్, జాన్‌బన్నీ, ఆగస్టీన్, బాలస్వామి, కుమార్, టిక్నా తదితరులు పాల్గొన్నారు.

తరిగొప్పుల: ఈస్టర్ పండుగ సందర్భంగా తెలుగు బాప్టిస్ట్ సంఘం ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు. తెలుగు బాప్టిస్టు చర్చి నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. కార్యక్రమంలో పాస్టర్ పీటర్, ఖాత దేవదానం, చెన్నూరి సత్యానందం, ఎడ్ల నవీన్, పాస్టర్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహమంటే ఇదేరా..!

బాల్య స్నేహితుడి కూతురు పెళ్లికి రూ. 60 వేల ఆర్థిక సాయం

లింగాలఘణపురం, మార్చి30: స్నేహానికన్న మిన్న లోకాన లేదురా నిరూపించారు బాల్య మిత్రులు.. వడ్డిచర్ల గ్రామానికి చెందిన తాళ్లపెల్లి దశరథ అనే యువకుడు నవాబుపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో 1997-98 లో పదో తరగతి వరకు చదువుకున్నాడు. ఆ తర్వాత పేదరికం కారణంగా మధ్యలోనే చదువు ఆపేసి అనారోగ్య పరిస్థితుల కారణంగా ఐదేళ్ల క్రితం మృతి చెందాడు. శనివారం దశరథ కుమార్తె అశ్విని వివాహం జరగగా బాల్యస్నేహితులు కలిసి రూ. 60వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆర్థిక సాయం చేసిన వారిలో బొల్లంపల్లి వెంకటేశ్వర్లు, గైని ఉపేందర్, మైదం సత్యనారాయణ, దూసరి రాజు, ఆలంశెట్టి సమ్మయ్య, పొన్నాల నరేశ్, ఎండి జావీద్, కొత్తపల్లి శంకర్, ఇట్టబోయిన ఉపేందర్, పద్మ, జ్యోతి, జ్యోతి ఉన్నారు.



పెళ్లి పీటలపై ఆర్థిక సాయం అందజేస్తున్న బాల్యమిత్రులు

కడియంను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దు

అధిష్ఠానం పునరాలోచించాలి • పార్టీ నాయకుల సూచన



లింగాలఘణపురంలో మాట్లాడుతున్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దిలీప్‌రెడ్డి

లింగాలఘణపురం, మార్చి30: కాంగ్రెస్ పార్టీలోకి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని చేర్చుకునే విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం పునరాలోచించుకోవాలని యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కీసర దిలీప్‌రెడ్డి అన్నారు. శనివారం లింగాలఘణపురంలో ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లుగా కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీని అణచివేసేందుకు, కాంగ్రెస్ సైనికులను అణగదొక్కడమే ధ్యేయంగా పనిచేశాడని గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. 40 ఏళ్ల కాంగ్రెస్ జెండాను నమ్ముకుని ఎత్తిన జెండాను దించకుండా కష్టపడ్డ కార్యకర్తలకు న్యాయం జరిగే విధంగా అధిష్ఠానం నిర్ణయం తీసుకోవాలని కోరారు. పార్టీలోకి కొత్తగా వచ్చిన వాళ్లకు కాకుండా వరంగల్ ఎంపీ టికెట్ సింగపురం ఇందిరకే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రఘునాథపల్లి: పదవులు ఆశించే కడియం శ్రీహరి కాంగ్రెస్‌కు అవసరం లేదని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి అన్నారు. కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని వ్యతిరేకిస్తూ మండల కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పదవుల కోసం టీడీపీని వీడి బీఆర్ఎస్‌లో చేరిన కడియం శ్రీహరి ఇప్పుడు అధికార దాహంతో తన కూతురు కావ్యను ఎంపీగా చేయడానికి కాంగ్రెస్‌లో చేరడానికి ప్రయత్నిస్తున్నాడని విమర్శించారు. కడయం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరే ముందు అటు బీఆర్ఎస్‌కు, ఇటు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 31న స్టేషన్‌ఘన్‌పూర్‌లో సుమారు 30 వేల మంది కార్యకర్తలతో సింగపురం ఇందిరకు మద్దతుగా పెద్ద ఎత్తున సమావేశం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

చిలుపూర్: కార్యకర్తలపై గతంలో అక్రమ కేసులు పెట్టిన కడియం శ్రీహరిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే విషయంలో అధిష్ఠానం పునరాలోచించాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జి తీగల మహేందర్ అన్నారు. శనివారం చిలుపూర్‌లో ఆయన మాట్లాడుతూ మాదిగ సామాజికవర్గాన్ని రాజకీయంగా అణగదొక్కాలన్న లక్ష్యంతోనే కడియం కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఆరోపించారు. తామంతా ఇందిర నాయకత్వంలోనే పని చేస్తామని స్పష్టం చేశారు.

జఫర్‌గడ్: గతంలో కాంగ్రెస్ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని ఆ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఎడ్ల వెంకటయ్య, పార్టీ నేతలు ముక్తార్, బాషా, దాట్ల అశోక్, రాజ్‌కుమార్, పరుశరాములు కాంగ్రెస్ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. శనివారం జఫర్‌గడ్‌లో వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో జెండాలు మోసిన కార్యకర్తలెందరో ఉన్నారని, కాంగ్రెస్ పార్టీని 12 వేల నుంచి.. నేడు 93 వేల ఓట్లకు తీసుకువచ్చిన ఘనత సింగపురం ఇందిరకే దక్కుతుందని అన్నారు. పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తున్న ఇందిరకు గానీ, కార్యకర్తలకు గానీ అన్యాయం జరిగితే సహించబోమన్నారు.

కడియం రాజీనామా చేయాలి: బీఆర్ఎస్

చిలుపూర్, మార్చి 30: బీఆర్ఎస్‌కు వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్‌లో చేరుతున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏడవెళ్లి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం చిన్నపెండ్యాలలో ఆయన మాట్లాడుతూ ఏనాడూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పని చేయని కడియం శ్రీహరిని బీఆర్ఎస్ అక్కున చేర్చుకుందని గుర్తుచేశారు. బీఆర్ఎస్‌లో ఎంపీ, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీల పదవులను అనుభవించిన ఆయన కేవలం తన స్వార్థప్రయోజనాల కోసమే బీఆర్ఎస్‌ను వీడుతున్నారని, త్వరలోనే ఆయనకు దళిత జాతి బుద్ధి చెబుతుందని హెచ్చరించారు.

లింగాలఘణపురం: కడియం శ్రీహరి బీఆర్ఎస్‌కు వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్‌లో చేరడం సిగ్గుచేటని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బస్వగాని శ్రీనివాస్, ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి, కొమురవెల్లి దేవస్థానం మాజీ ఛైర్మన్ సేవెల్లి సంపత్ అన్నారు. శనివారం లింగాలఘణపురంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ముఖ్యనాయకుల సమావేశాన్ని నిర్వహించిన సందర్భంగా కడియం శ్రీహరి పార్టీ మార్పు అంశాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కడియం శ్రీహరి గెలుపు కోసం కార్యకర్తలమంతా తమ భుజాలపై ఎత్తుకుని పనిచేశామన్నారు. కడియం పార్టీ మారడం అనివార్యమనుకుంటే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చిట్ల ఉపేందర్ రెడ్డి, ఎంపీటీసీలు గోలి రాజు, తీగల సిద్దుగౌడ్, సేవల్లి మధు, నర్సింహ్మా, మల్లేశం, యాదగిరి, రేగు శ్రీను, గట్టగల్ల శ్రీహరి, మబ్బు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.